



# ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు ఆత్మగౌరవం

- ఇంద్రపాలనగరంలో నూతన గృహాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం
- లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందోత్సాహం

**తొలివెలుగు, రామన్నపేట:** పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో మల్లం ధనమ్మ, పాగుడల వెంకటేశం నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఆదివారం గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆత్మీయంగా అభినందించి, వారి నూతన గృహాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు నెలకొనాలని ఆకాంక్షించారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన కమ్మలపల్లి మధు నూతన గృహప్రవేశ కార్యక్రమంలోనూ పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదల సంక్షేమం, గృహ వసతి కల్పన విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ పూస బాలమణి బాలనరసింహ, జిల్లా నాయకులు పూస బాలకిషన్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.ద

# పాల సంఘాల బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి: ఎమ్మెల్యే వేముల వీరేశం

- ఉత్తటూర్ పాల సంఘం నూతన చైర్మన్ ఎనుగుల వెంకట్ రెడ్డికి అభినందనలు



**తొలివెలుగు, రామన్నపేట:** గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో, రైతులు, పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధిలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఉత్తటూర్ గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన చైర్మన్‌గా నియమితులైన ఎనుగుల వెంకట్ రెడ్డి ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారులు, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాల సంఘం నూతన పాలకవర్గం సమిష్టిగా పనిచేయాలని సూచించారు. చైర్మన్‌గా ఎనుగుల వెంకట్ రెడ్డి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, ఉత్తటూర్ పాల సంఘాన్ని జిల్లాలోనే ఆదర్శవంతమైన సంఘంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్తటూర్ సర్పంచ్ కోళ్ళ రామస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పవర్‌లూమ్ సొసైటీ అధ్యక్షుడిగా రామకిష్టయ్య ఏకగ్రీవం

- రాజాపేట శ్రీనివాస పవర్‌లూమ్ నూతన కమిటీ ఎన్నిక



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట శ్రీనివాస పవర్‌లూమ్ సొసైటీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ నూతన అధ్యక్షుడిగా ఆడెపు రామకిష్టయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఆడెపు శ్రీశైలం, కార్యదర్శిగా సకినాల శ్రీనివాసులు, కోశాధికారిగా పొట్టబత్తిని నరహరి ఎన్నికైనట్లు పద్మశాలి సంఘం ప్రతినిధులు తెలిపారు. సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులుగా గొట్టిపాముల సాయికృష్ణ, సకినాల ఉపేందర్, పొట్టబత్తిని నరేందర్, ఆడెపు రమాదేవి, కర్నాటి లక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల అనంతరం పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెపు శ్రీశైలం, పద్మశాలి సంఘం రాజాపేట మండల అధ్యక్షుడు చిన్నం వెంకటరమణ తదితరులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. చేనేత, జౌళి రంగాల అభివృద్ధికి, పవర్‌లూమ్ కార్మికుల సంక్షేమానికి నూతన కమిటీ కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

# యాదగిరిగుట్టలో మెగా శాఖాహార ర్యాలీ






- ప్రపంచ శాఖాహార, అహింసా దినోత్సవాల సందర్భంగా నిర్వహణ
- అధిక సంఖ్యలో పాల్గొన్న రాజాపేట మండల వాసులు

**తొలివెలుగు, రాజాపేట:** ప్రపంచ శాఖాహార, అహింసా దినోత్సవాలను పురస్కరించుకుని యాదగిరిగుట్టలో నిర్వహించిన మెగా శాఖాహార ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. ఈ ర్యాలీలో రాజాపేట మండలానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శాఖాహార జీవన విధానానికి మద్దతు తెలిపారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ కొండ పాదాల చెంత నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. పాల్గొన్నవారు చేతుల్లో జెండాలు, శాఖాహారం విశిష్టతను తెలియజేసే ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ర్యాలీ సందర్భంగా శాఖాహార జీవన విధానం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, అహింసా సందేశాన్ని పాటలు, ప్రసంగాల ద్వారా వివరించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు కూడా ఆసక్తిగా ర్యాలీని వీక్షించగా, పలువురు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో ధ్యాన పిరమిడ్ నిర్వాహకులు గౌటే బాలరాజు, డాక్టర్ గొట్టిపాముల వెంకటేశ్వర్లు, ఎర్ర గోకుల అంజలి, కూనూరు భిక్షపతి, ఉప్పల రమేష్‌తో పాటు రాజాపేట మండలానికి చెందిన శాఖాహార ప్రచారకులు, భక్తులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం: వెంకటేష్ యాదవ్





- జలాల్పురంలో నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం
- లబ్ధిదారులకు ఘన సన్మానం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** సామాన్యులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన గొప్ప వరం ఇందిరమ్మ ఇంటి పథకమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని జలాల్పురం గ్రామంలో ఆదివారం పున్న లావణ్య నరేష్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతాయని, పల్లెల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలాల్పురం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండ్ల మహేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు పాలకూర ఆగయ్య గౌడ్, మాజీ సర్పంచ్ శాపాక భిక్షపతి, దేవాలయ కమిటీ చైర్మన్ కేసారం సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు వడ్డేపల్లి విష్ణు, శాపాక శంకర్, కేసారం నరేందర్ రెడ్డి, బైరు శివాజీ గౌడ్, శాపాక శ్రీకాంత్, పాలకుర్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో భక్తిశ్రద్ధలతో సహస్ర పారాయణం

- ప్రత్యేక పూజలు, గోత్రనామార్చనల్లో పాల్గొన్న భక్తులు

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో జై శ్రీమన్నారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో సామూహిక సహస్ర పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు లలిత సహస్రనామ పారాయణం, గోవింద నామ సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. అనంతరం ఆలయ అర్చకులు గోత్రనామార్చనలు నిర్వహించి, దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, లోకక్షేమం, సకల జనుల ఆయురారోగ్యాలు, సుభిక్షం కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నంగునూరు జగదాంబ, బిర్రు లక్ష్మి, బోగ లత, చామకూర అరుణ, ఉప్పల స్వప్నతో పాటు జై శ్రీమన్నారాయణ భక్త బృంద సభ్యులు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# 'సర్' సర్వేలో సమస్యలు పరిష్కరించాలి

- జూలై 7న కలెక్టరేట్ ముట్టడికి అంగన్‌వాడీల సన్నద్ధం
- అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు బూర్గు స్వప్న

**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'సర్' (సామాజిక ఆర్థిక సర్వే) కార్యక్రమం క్షేత్రస్థాయిలో అనేక సాంకేతిక, పరిపాలనా సమస్యలతో కొనసాగుతోందని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు బూర్గు స్వప్న ఆరోపించారు. సర్వే విధుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7న జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ సందర్భంగా సామూహికంగా వినతిపత్రం సమర్పించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వే నిర్వహణలో తలెత్తుతున్న సమస్యల కారణంగా అంగన్‌వాడీ టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే అంగన్‌వాడీ సిబ్బందిని 'సర్' సర్వే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ విధులు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయిస్తే అదనంగా రూ.30 వేల ప్రత్యేక పారితోషికం చెల్లించడంతో పాటు, సర్వే పూర్తయ్యే వరకు అంగన్‌వాడీ విధులకు మినహాయింపు కల్పించాలని కోరారు. అలాగే ప్రతి గ్రామానికి ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించి ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆదివారాలు, పండుగ రోజుల్లో సెలవులు ప్రకటించాలని, ఓటరు గుర్తింపు కార్డుల్లో నమోదయ్యే తప్పులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, గత ఐదేళ్లుగా బీఎల్ఓలకు చెల్లించాల్సిన బకాయిల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రీ-ప్రైమరీ పీఎం శ్రీ కేంద్రాలను వెంటనే నిలిపివేయాలని, అంగన్‌వాడీ సిబ్బందిపై అధికారులు, ప్రజాప్రతినిధుల వేధింపులను అరికట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సర్వే నిర్వహణ గడువును పొడిగించి, తమ సమస్యలను పరిష్కరించకపోతే విధులను బహిష్కరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని బూర్గు స్వప్న హెచ్చరించారు.



